(బల్లిపాడులో శ్రీ నాన్నగారి ప్రవచనము, 19-11-97)

ప్రియ మైన ఆత్మ బంధువుల్లారా !

మరణం లేని వస్తువు ఒకటి నీ హృదయంలో ఉంది. దానినే ఆత్మ అంటారు. అది నీవే అన్న సంగతి నీకు తెలియటం లేదు. జాతితో, మతంతో, కులంతో సంబంధం లేకుండా అది అందరి హృదయాలలో ఉంది. నీ శరీరం మరణించిన దానికి మరణం లేదు. ఇప్పుడు దేహం ఏ విధంగా అయితే నీకు అనుభవంలో ఉందో అదే విధంగా నీ హృదయంలో ఉన్న వస్తువును అనుభవంలోనికి తెచ్చుకోవటమే జ్ఞానం. మానవుడికి ప్రాపంచిక జబ్బు ఉండకూడదు, నిర్మలమైన జీవితం ముఖ్యం. తాను ఎవరో తనకి తెలిసే వరకూ ప్రతీ మనిషికి ఏదో ఒక వెలితి ఉంటుంది. తాను ఎవరో తనకి తెలిసే వరకూ ఒక దుఃఖం తరువాత ఇంకో దుఃఖం వెంటాడుతూనే ఉంటుంది. ఆర్థికపరంగా బాగుండటం మంచిదే అంతమాత్రంచేత వారు దుఃఖం లేకుండా శాంతిగా ఉన్నారు అనుకోవటానికి వీలులేదు. శాంతి అనేది నీహృదయంలో నుండి వచ్చే ఒక ప్రవాహం. భౌతికమైన అభివృద్ధి ముఖ్యం అనుకొంటాము. కాని అధ్యాత్మిక అభివృద్ధి అంత కంటే ముఖ్యం. ఆర్థికంగా అభివృద్ధిలో ఉంటే ఆర్థికపరమైన బాధలను ఎలా తట్టుకొంటాడో అలాగే అధ్యాత్మికంగా అభివృద్ధిలో ఉంటే మానసిక ఒత్తిడులను తట్టుకొంటాడు అందువలన ఆధ్యాత్మికవిద్య అవసరం.

మానవుడికి దీర్ఘప్రణాళిక ఉండదు. ఆ టైముకు ఏది అవసరమో అదే అడుగుతారు. మొదట దేవుడిని కోరికల కోసం ప్రార్థించినా నీమనస్సుకు పక్వతవస్తే భగవంతుడినే పొందాలి, అనే కాంక్ష నీకు కలుగుతుంది. జ్ఞానం యొక్క విలువ తెలిసినవారు జ్ఞానాన్ని అడుగుతారు, జ్ఞానం యొక్క విలువ తెలియని వాడు భౌతిక విషయాలు కోరుకొంటాడు. చాలా మందికి భగవంతుని కంటే ఆయన సృష్టించిన విషయాలు అంటే ఎక్కువ ఇష్టపడతారు. వాటిని దాటి భగవంతుడికి సంబంధించిన జ్ఞానాన్ని కోరుకోవటం కోసం ఆధ్యాత్మికవిద్య అవసరం. ఆధ్యాత్మిక విద్య లేకపోతే శాంతి లేదు, శక్తిలేదు, ఒక ప్రక్క వాసన తగ్గించు కొంటూ రావాలి, ఇంకో ప్రక్క జ్ఞానం సంపాదించటానికి ప్రయత్నం చేయాలి. ఈపని, ఆపని ఒకేసారి ఎలా చేయాలి అంటే కుదరదు. నీవు చేయగలిగినంత, నీ అర్హతను బట్టి రెండూ ఒకేసారి చేసుకొంటూరావాలి. అనుకరణ పనికిరాదు. సొంతంగా ఆలోచించుకొంటూ చేయగలిగినంత చేసుకొంటూరావాలి. చిన్న ప్రయత్నం అయినా అందులో చిత్తశుద్ధి ఉంటే, ఏకాగ్రత ఉంటే, అర్పణ భావన ఉంటే చేసేది చిన్నది అయినా ఆధ్యాత్మికప్రగతి తొందరగా జరుగుతుంది. నీ అహంభావనను ముస్తాబు చేసుకోవటానికి కాకుండా భగవంతుని ప్రీతికోసం పనిచేస్తూ ఉంటే నీ మీద ఆయనకు దయ కలుగుతుంది. సమదృష్టి పెట్టుకొని పనిచేస్తూఉంటే వాడు చేస్తున్నపనే జ్ఞాన సముపార్జనకు వాడికి సహకరిస్తుంది. నీవు చేస్తున్నపని నిన్ను బంధించకూడదు. నిన్ను అజ్ఞానమునుండి విడుదల చేయాలి. మనం ఎవరికైనా సహాయం చేస్తూ ఉంటే వారిని ఉద్ధరిస్తున్నాము అనుకోకూడదు, వారికి సహాయం చేయుటానికి మనకు అవకాశం ఇచ్చారు అనుకోవాలి. వారిని ఉద్ధరిస్తున్నాము అనుకొంటే వారు ఎలాగు ఉద్ధరించబడరు.

మనకు పొగరుబోతుతనం వస్తుంది. బయటకు నీవు బాగానే కనిపిస్తున్న లోపల కుళ్ళి పోతూ ఉంటావు. నీవు చేసేపని నిర్మలంగా ఉండాలి, సహజంగా ఉండాలి. ఉదయం స్నానంచేసి నేను ఏదో గొప్పపని చేసాను అనుకొంటావా ? లేదు. ఎందుచేత రోజూ స్నానం చేయటం అనేది నార్మల్‌గా జరిగేపని అలాగే నీవు చేసే సేవ, పని కూడా నార్మల్‌గా ఉండాలి, కృత్రిమంగా ఉండకూడదు.

బంధానికి కారణం మనస్సు. నీమనస్సును హృదయంలో నిలబెడితే అది లయమవుతుంది అప్పడు బంధం కరిగిపోతుంది. మనస్సును నీ అంతట నీవు హృదయం వైపుకు మళ్ళించలేవు. దానికి గురువుఅనుగ్రహం అవసరము. నిజమైనగురువు మన హృదయంలోనే ఉన్నాడు. మనకు అర్హత కలిగినపుడు ఒక రూపం దాల్చి వచ్చి ఆయనతో అనుబంధాన్ని ఏర్పరచుకొని, ఆయన మీద ప్రేమ కలిగేటట్లు చేసి, ఆయన మాటలు వినేటట్లు చేసి, ఆచరించేటట్లు నీకు శ్రద్ధ కలుగజేసి మీ మధ్య మీతోపాటు తిరుగుతూ ఆయన అన్నింటికి అతీతుడు అయినప్పటికి మీరు సంతోషిస్తే ఆయనా సంతోషిస్తూ, మీరు దుఃఖిస్తే ఆయనా దుఃఖిస్తూ మీతో తిరిగి, తిరిగి మీ చైతన్య స్థాయిని పెంచి మీకు ఆత్మానుభవం కలుగజేస్తాడు ఆయనే గురువు. ఆయన స్థాయిని మనం అందుకోలేక పోవచ్చును. మన స్థాయికి ఆయనే దిగివస్తాడు ఎందుకంటే ఆయనంతటి వారిగా మనలను చేయటమే ఆయన ఉద్దేశం. ఎంత మంచి మాటలు చెప్పినా కొంతమంది మనస్సును మూసేసు కొంటారు. మంచి మాటను ఎవరు చెప్పినా దానిని స్వీకరించి దానిని సొంతం చేసుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి.

గురువు ఎప్పడూ ఆత్మలో స్థిరంగా ఉంటాడు, అందరినీ సమానంగా చూస్తాడు. దేహప్రారబ్దం నీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా సమానబుద్ధిని విడిచి పెట్టవద్దు. ఎళ్ళ వేళలా అన్ని ప్రదేశాలలో, అన్నిపరిస్థితులలో అచంచలమైన ధైర్యంగా ఉండు, చింతాకంత కూడా చింత పెట్టుకోవద్దు. దేహాన్ని ప్రారబ్ధానికి విడిచిపెట్టు. గురువుని, ఈశ్వరుని చింతిస్తూ జ్ఞానాన్ని సంపాదించుకో. ఇది చెయ్యి, అదిచెయ్యి అనిగురువు ఏమీ చెప్పడు. గురువు సమక్షంలో ఏది చేయాలో నీకు స్ఫురిస్తుంది. జ్ఞానమును సంపాదించుఅని నిజమైనగురువు నిన్ను బలవంతం చేయడు, నీహృదయాన్ని కెలికి జ్ఞానమును సంపాదించాలనే కాంక్షను నీకు తీసుకొని వస్తాడు.మీకు ఉన్న సమస్య లేవో మీకు ఉన్నాయి. గురువు అదనంగా మీకు సమస్యలు తెచ్చిపెట్టడు. మీకు ఉన్న సమస్యలను తట్టుకొనే శక్తిని గురువు మీకు ప్రసాదిస్తాడు. దానితోపాటు జ్ఞాన సముపార్జనకు మీకు సహకరిస్తాడు. కోరిక, భయం, కోపం వీటిని దుష్ట త్రయం అంటారు. వీటిలో నుండి విడుదల పొందితేగాని నీకు జ్ఞానం కలుగదు. భగవంతుడిని ఆశ్రయిస్తే, ఆయన నీడలో నీవు ఉంటే ఏపని చేస్తున్నా ఆయన సమక్షంలో ఉన్నాము అని జీవిస్తూ ఉంటే అప్పడు దుష్టత్రయంలో నుండి బయట పడతావు. లోకానికి ఏదైతే ఆధారంగా ఉందో ఆశక్తిని మర్చిపోకూడదు. మీరు ఏమి చేస్తున్నా మనస్సు భగవంతుని మీద ఉండాలి. పూర్వం అనేక మంది నన్ను ఆశ్రయించి, నన్ను ప్రేమించి, జ్ఞాన తపస్సు చేసి నా స్వరూపమును పొందారు. నీవు కూడా అలా చేసి నా స్వరూపమును పొందు అని భగవంతుడు గీతలో చెప్పాడు.